పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- కమిషనర్ ఆకస్మిక తనిఖీ
- మస్టర్ కేంద్రాల సందర్శన
- సిబ్బంది పనితీరుపై ఆరా



వెహికల్ యార్డ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్. చిత్రంలో ఏడీసీ నాగనరసింహారావు తదితరులు

కాకినాడ: పారిశుధ్యాన్ని మరింత గాడిలో పెట్టే దిశగా నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల దృష్టి సారించారు. మంగళవారం తెల్లవారుజామున ఐదు గంటలకే తనిఖీలకు వెళ్లారు. ఏడీసీ సీహెచ్ నాగ నరసింహారావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్ ఆయన వెంట ఉన్నారు. ఐదో సర్కిల్ మస్టరు కేంద్రాన్ని తనిఖీ చేసి కార్మికుల హాజరును పరిశీలించి మస్టర్ సమయానికి, విధులకు హాజరయ్యే సమయానికి మధ్య వ్యత్యా లేకుండా చూడాలని ఎంహెచ్ఓను ఆదేశించారు. అక్కడి నుంచి 17వ డివిజన్లో పర్యటించిన కమిషనర్ చెత్త సేకరణను పరిశీలించారు. జగన్నాథపురం చిన్న మార్కెట్‌ను కూడా పరిశీలించారు. బొందగుంటలోని వెహికల్ యార్డ్‌ను, గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్‌ను సందర్శించారు. అందుబాటులో ఉన్న హూపర్ టిప్పర్ వాహనాలు, వాటి పనితీరును ఏడీసీ వివరించారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలకమైన పారిశుద్ధ్య విభాగం మరింత సమర్థంగా పని చేయాలని, సంబంధిత అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని కమిషనర్ కోరారు. శానిటరీ సూపర్‌వైజర్లు జిలాని, రాంబాబు తదితరులు ఉన్నారు.

టిడ్కో రిజిస్ట్రేషన్లు వేగవంతంచేయండి

టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల ఆదేశించారు. మంగళవారం ఆయన ఏడీసీ నాగ నరసింహారావుతో కలసి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ మొదటి విడత 1152 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ముందుగా వీరందరికీ రిజిస్ట్రేషన్లు పూర్తిచేసి, ఆ తర్వాత బ్యాంకు మార్టిగేజ్ ప్రక్రియ కూడా చేపట్టాల్సి ఉంటుందన్నారు. కాకినాడ, సర్పవరం రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరుగుతాయన్నారు. రోజుకు 120 రిజిస్ట్రేషన్లు అయ్యేలా ఏర్పాట్లు చేశామన్నారు. నెలాఖరు లోపుగా ఈ మొత్తం ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. టీపీఆర్వో మానే కృష్ణమోహన్, సిటీ మిషన్ మేనేజర్ వెంకటరాజు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

సరిహద్దు రాళ్లను వేగంగా ఏర్పాటుచేయండి

- కలెక్టర్ కృతికా శుక్లా
- పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన



రాళ్లు పాతే ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లాలో సమగ్ర రీ సర్వే ప్రక్రియలో భాగంగా చేపట్టిన సరిహద్దు రాళ్ల ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం రెవెన్యూ, సర్వే ఇతర శాఖల అధికారులతో కలిసి కాకినాడ అర్బన్ మండలం, మేడలైన్ గ్రామం వద్ద రాళ్ల ఏర్పాటు ప్రక్రియను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో తొలిదశ 121 గ్రామాల్లో రీ సర్వే పనులు పూర్తయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో ల్యాండ్ పార్శిల్ మ్యాప్ ద్వారా సరిహద్దు రాళ్లు వేసే ప్రక్రియను చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. సరిహద్దు రైతులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా రాళ్లు పాతాలని, ఈ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట కాకినాడ ఆర్డీవో బీవీ రమణ, ఏడీ సర్వే బి.లక్ష్మీనారాయణ, అర్బన్ తహసీల్దార్ సీతాపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా

కాకినాడ సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ జేఏసీ అమరావతి, ఏపీ స్టేట్ గవర్నమెంట్ విశ్రాంత ఉద్యోగుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు, ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు కె.పద్మనాభం మాట్లాడుతూ దశల వారీ పోరాటంలో నిరసన ధర్నా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు.

క్లుప్తంగా

రికార్డులన్నీ అప్‌డేట్ చేసుకోవాలి

కరప: విద్యా సంవత్సరం ముగియనున్నదని, తమ పాఠశాలలకు సంబంధించిన రికార్డులన్నీ అప్‌డేట్ చేసుకుని ఉండాలని ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించి పలు సూచనలిచ్చారు. విద్యార్థులకు రాగిజావ ఇచ్చేందుకు స్టీలు గ్లాసులు వచ్చాయని, వాటిని తీసుకుని, తమ వద్ద జాగ్రత్త చేసుకోవాలన్నారు. పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులపై ఆరాతీసి, అనుసరించాల్సిన విధి, విధానాలపై సూచనలిచ్చారు. ఈనెలాఖరుకల్లా జగనన్న విద్యాకానుక కిట్లు వస్తాయని, ఆ స్టాకును తీసుకోవడానికి హెచ్ఎంలందరూ అందుబాటులో ఉండాలని ఎంఈఓ కోరారు.

మేడే జయప్రదం చేయండి

కాకినాడ సిటీ: కార్మిక, కర్షక, ప్రజా అనుకూల విధానాలను డిమాండ్ చేస్తూ ప్రతి గ్రామంలో రైతులు, కార్మికులు మేడే జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు ఏవీ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం కాకినాడ కచేరిపేటలోని సీఐటీయూ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వ కార్పొరేట్ విధానాలను ప్రశ్నిస్తూ ఢిల్లీ రాంలీలా మైదానంలో లక్షలాది మందితో ధర్నా జయప్రదం చేసిన రైతులు, కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్‌కు అపూర్వ స్పందన



జగనన్నే మాభవిష్యత్ స్టిక్కర్‌ను డోర్‌కు అతికిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

కరప: మండలం కొరిపల్లి, వేములవాడ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించింది. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు సర్పంచ్‌లు తదితరులు ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న పథకాలు, పాలనపై పూర్తి సంతృప్తితో ఉన్నామని, ఆయనకు వచ్చే ఎన్నికల్లో కూడా సంపూర్ణ మద్దతు ఇస్తామని అంగీకారం తెలిపారు. తమ ఇళ్లపై స్టిక్కర్లను అతికించేందుకు అంగీకారం తెలిపి, మద్దతు ప్రకటించారు. తమ మొబైల్ ఫోన్లనుంచి మిస్డ్ కాల్స్ ఇచ్చి జగనన్న పాలనకు మద్దతు ప్రకటించారు.

శృతిరెడ్డికి ఛాత్రాలయ పురస్కారం



ఛాత్రాలయ పురస్కారం అందుకుంటున్న శృతిరెడ్డి

బాలాజీచెరువు: సుచిర్ ఇండియా ఫౌండేషన్ నిర్వహించిన సీవీ రామన్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో శ్రీనగర్ ఆదిత్య పాఠశాల ప్రతిభ చూపడంతో బెస్ట్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ అవార్డుగా ఛాత్రాలయ పురస్కారం అందజేశారు. రాష్ట్ర స్థాయిలో రెండు, జిల్లా స్థాయిలో ఏడు సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డులు కైవసం చేసుకోవడంపై ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ పురస్కారం హైదరబాద్ రవీంద్రభారతిలో ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ శృతిరెడ్డికి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, సినీ డైరెక్టర్ అడవి శేషుల మీదుగా స్వీకరించారు.

ప్రజాదరణే పాలనకు నిదర్శనం



పూర్తిచేసిన ప్రశ్నావళిని బాక్సుల్లో ఎమ్మెల్యే ద్వారంపూడికి అందజేస్తున్న నాయకులు

ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనను అన్ని వర్గాల ప్రజలు ఆదరిస్తున్నారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. సాధారణ ప్రజలు, విద్యావంతులు, ఉద్యోగులతో పాటు అన్ని వర్గాలు ఉన్న 5వ డివిజన్‌లో జగనన్నే మా భవిష్యత్‌కు వచ్చిన ఆదరణే ఇందుకు నిదర్శనమన్నారు. స్థానిక డివిజన్ మాజీ కార్పొరేటర్ నల్లబెల్లి సుజాత, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు మంగళవారం ఎమ్మెల్యే ద్వారంపూడిని ఆయన నివాసంలో కలిసి తమకు అప్పగించిన సుమారు 1800 ప్రశ్నావళి పత్రాలను అప్పగించారు. క్లస్టర్ ఇన్‌చార్జి సుంకర విద్యాసాగర్ ఆధ్వర్యంలో నగరంలో ముందుగానే ఈ ప్రక్రియను పూర్తి చేసినట్టు మాజీ కార్పొరేటర్ నల్లబెల్లి సుజాత చెప్పారు. అలాగే తమ డివిజన్‌లో ప్రతి ఇంటి నుంచి మిస్డ్‌కాల్ కూడా ఇచ్చారన్నారు. పార్టీ నాయకులు రాగిరెడ్డి సుబ్బారావు, సుంకర విద్యాసాగర్, కన్వీనర్లు పాల్గొన్నారు.

దాతృత్వానికి ప్రతీక రంజాన్

స్నేహభావానికి, దాతృత్వానికి రంజాన్ మాసం ప్రతీక అని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జ్యోతుల మార్కెట్‌లో మాజీ కార్పొరేటర్ తెహరాఖాతూన్ ఆధ్వర్యంలో సుమారు 500 మంది పేదలకు ఎమ్మెల్యే ద్వారంపూడి వస్త్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంపాదనలో కొంత భాగాన్ని పక్కన పెట్టి పదిమందిని ఆదుకోవాలనే లక్ష్యంతో ఉండే ముస్లిం మైనార్టీలు ఆదర్శనీయులన్నారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మైనార్టీ సెల్ ప్రాంతీయ సమన్వయకర్త అబ్దుల్ బషీరుద్దీన్, నగర మైనార్టీసెల్ అధ్యక్షుడు ఖాలిద్ బిన్‌వలీ, జ్యోతుల మార్కెట్ అధ్యక్షుడు మొయిన్‌ఖబూన్, ముస్లిం ప్రముఖులు ఆలీషా, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి



కంటిపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కరప: వృద్ధుల కంటిచూపును పరిరక్షించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సాదే ఆశాజ్యోతి పేర్కొన్నారు. స్థానిక చిరంజీవి కళ్యాణ మండపంలో కాకినాడ డివిజన్ వైద్యాధికారి ఆర్.శ్రీనివాస్‌నాయక్, వైద్యసిబ్బంది డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు పథకంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. శిబిరానికి 45 మంది వృద్ధులు రాగా ఎస్ఎంఓ డాక్టర్ సురేఖ నాగలక్ష్మి కంటిపరీక్షలు నిర్వహించారు. వీరిలో 36 మందికి కళ్లజోళ్లు పడతాయని గుర్తించారు. వారికి ఆశా వర్కర్లు కళ్లజోళ్లు తీసుకు వచ్చి, అందజేస్తారని వైద్యులు తెలిపారు. పీహెచ్‌సీ సిబ్బంది కుమారి, బాలామణి, హెచ్‌వీ సత్యనారాయణమ్మ, రెహనా బేగమ్, ఆశా వర్కర్లు రెడ్డి వెంకటలక్ష్మి, వైవీ అనంతలక్ష్మి, ఎ.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బంది లేకుండా తాగునీరు ఇవ్వండి

- కొంగోడులో డీపీఓ పర్యటన
- వంతుల వారీగా సర్దుబాటు చేయాలని అధికారులకు ఆదేశం

సాక్షి ఇంపాక్ట్



కొంగోడు ఎస్సీవీధిలోని వీధికుళాయిని పరిశీలిస్తున్న డీపీఓ విక్టర్

కరప: జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ మంగళవారం కొంగోడులో వీధికుళాయిలను పరిశీలించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగునీరందించాలని ఆదేశించారు. మండలం కొంగోడులో వీధికుళాయిలు నుంచి సన్నని ధారతో రావడం, మిట్ట మధ్యాహ్నం కుళాయిలు వదలడం, తక్కువ సమయం వదలడంతో తాగునీరు పట్టుకోవడానికి గ్రామస్తులు, ఎస్సీ వీధి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సాక్షిలో మంగళవారం 'మధ్యాహ్నం.. బిందెడు కష్టం' అనే శీర్షికన ప్రచురితమైన ఫొటో కథనంపై స్పందించిన డీపీఓ, గ్రామసర్పంచ్ నక్కా బాబులు, ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, కార్యదర్శి పి.శ్రీనివాస్ తదితరులతో కలసి గ్రామంలో వీధి కుళాయిలను పరిశీలించారు. తర్వాత గొల్లపాలెంలోని సామూహిక రక్షిత నీటి పథకాన్ని పరిశీలించారు. గ్రామంలో 60 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న తాగునీటి ట్యాంక్ ఉండటం వల్ల శివారు ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా అందడంలేదని పంచాయతీ అధికారులు తెలిపారు. డీపీఓ స్పందించి గ్రామాన్ని రెండు భాగాలుగా చేసి ఒకరోజు ఒకపక్కకు, మరుసటి రోజు రెండో పక్కకు వీధికుళాయిలు వదలాలని, అది కూడా ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉదయం వదలాలని ఆదేశించారు.

క్లోరినేషన్ చేశాకే సరఫరా చేయాలి

గ్రామాల్లో ఓవర్ ట్యాంక్‌లను నెలకు రెండుసార్లు తప్పనిసరిగా శుభ్రం చేసి, క్లోరినేషన్ చేసిన తర్వాతనే తాగునీరు సరఫరా చేయాలని డీపీఓ విక్టర్ ఆదేశించారు. గ్రామాల్లోని పీడబ్ల్యూఎస్, సీపీడబ్ల్యూఎస్ తాగునీటి పథకాలు నూరుశాతం శుభ్రంచేసేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ కృత్తికాశుక్లా మంగళవారం ఆదేశాలు జారీ చేయడంతో ఆయన మండలంలోని నడకుదురు, కొంగోడు, కరప తదితర గ్రామాల్లో పర్యటించి మంచినీటి ట్యాంక్‌ల శుభ్రంచేసే పనులను, పారిశుధ్య పనుల నిర్వహణ, చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించి, పంచాయతీ అధికారులకు, సిబ్బందికి సూచనలిచ్చారు. గ్రామ సర్పంచ్‌లు డేగల లలితకుమారి, నక్కా బాబులు, సాదే ఆశాజ్యోతి, ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, కార్యదర్శులు పీఎస్‌వీఆర్ బ్రహ్మానందం, పి.శ్రీనివాస్, వి.సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

షెడ్యూలు :

[illegible]

లంకా విజయ కుమార్, లంకా వంశీ కృష్ణ, న్యాయవాదులు
2వ లైను, [illegible] నగర్, గుంటూరు, సెల్ నెం. 98480 52914, 90365 95227

సంస్థ ఆశయాలను కొనసాగించండి

బోట్‌క్లబ్: లిటరరీ అసోసియేషన్ పేరిట టౌన్‌హాల్ ఏర్పాటు చేసిన వ్యవస్థాపకుల ఆశయాల పరిరక్షణకు నూతన కమిటీ అంకితభావంతో కృషి చేయాలని ప్రముఖ న్యాయవాది జీవి కృష్ణ ప్రకాష్ అన్నారు. టౌన్‌హాల్ కమిటీ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికవడం ద్వారా సభ్యుల మధ్య స్నేహభావాన్ని పెంపొందించేందుకు సహకరించిన కృష్ణప్రకాష్‌ను కమిటీ నూతన అధ్యక్షులు జీఎస్ఎన్ మూర్తి (నానాజీ), కార్యదర్శి పాటోలు చిన పున్నయ్య మంగళవారం ఆయన నివాసంలో సత్కరించారు. కార్యదర్శి మాట్లాడుతూ మే 14న క్లబ్ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మత్తు అనర్థాలపై అవగాహన

బాలాజీచెరువు: ఆంధ్రా పాలిటెక్నికల్ కళాశాలలో మంగళవారం మత్తుపదార్థాల వినియోగం అనర్థాలపై అవగాహన నిర్వహించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ కె.రామ్మోహనరావు హాజరై యువత మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల కలిగే నష్టాలు తెలియజేసి తక్కువ వయసులో మత్తు చిత్తులో పడి జీవితం నాశనం చేసుకుంటున్నారు. ప్రిన్సిపాల్ జనర్దనరావు, కో–ఆర్డినేటర్ గణేష్, యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

కరప: స్థానిక దుర్గాదేవి ఆలయం వద్ద మంగళవారం డీవీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. కాకినాడ–రామచంద్రపురం రహదారిలో ప్రయాణికులకు మినరల్ వాటర్ బాటిల్స్ అందజేశారు. గ్రామానికి చెందిన దేవగుప్తాపు వీరభద్రరావు స్మారకంగా ఆయన కుమారులు డీహెచ్‌వీ సాంబశివరావు, డీఎస్ఎన్ మూర్తి డీవీఆర్ ట్రస్ట్‌ను ఏర్పాటుచేశారు. మాజీసర్పంచ్ పోలిశెట్టి తాతీలు, చీర్ల శ్రీనుబాబు పాల్గొన్నారు.